





గుడిబండ ఆంజనేయస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు.. హెలికాప్టర్ ద్వారా పూలవర్షం

అంజన్న వైభవం

కుందుర్పి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డీపాలెం గ్రామంలో వెలిసిన గుడిబండ ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. 11 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య రథోత్సవం ప్రారంభమైంది. కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తుడు.. రథోత్సవంపై హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించారు. వేలాదిమంది భక్తులు.. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డుపైకి ఎలుగుబంటి



రోడ్డుపై సంచరిస్తున్న ఎలుగుబంటి

రాయదుర్గం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద రోడ్డుపై రెండ్రోజులుగా ఎలుగుబంటి హల్‌చల్ చేస్తోంది. శనివారం రాత్రి ద్విచక్రవాహనదారులకు ఎలుగుబంటి కనిపించడంతో భయాందోళన చెందారు. సమీపంలో వున్న కురాకుల గుట్ట నుంచి వచ్చి రోడ్డు మీద సంచరిస్తున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఆదివారం పగలే రోడ్డుపైకి రావడంతో పరిసర ప్రాంత ప్రజలు పరుగులు పెట్టారు. అరగంటపాటు రోడ్డుపై సంచరించిన ఎలుగుబంటి తర్వాత గుట్టల్లోకి వెళ్లిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించి, కాలనీ వాసులకు పలు సూచనలు ఇచ్చారు.



119వ కిలోమీటర్ వద్ద చేపడుతున్న యూటీ పనులు (ఫైల్)

అన్నీ మంచి రోజులే..!

హెచ్చెల్సీ మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్

రూ.37 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం

కాలువ అభివృద్ధిని పట్టించుకోని గత వైసీపీ సర్కార్

రాయదుర్గం/బొమ్మనహాళ్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ) మరమ్మతుల పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకుంది. ఈక్రమంలోనే గత ప్రభుత్వ అంక్షలను ఎత్తేస్తూ రూ.37 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రతి ఏటా కాలువలో కేటాయింపు జలాలను సరిహద్దు నుంచి పీఏబీఆర్ వరకు తీసుకెళ్లేందుకు అధికారులు కుస్తీలు పట్టే పరిస్థితి ఉండేది. కనీసం ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న చోటుకైనా నిధులు కేటాయించాలని పలు సందర్భాల్లో గత ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదు. దీంతో అధికారులు, అన్నదాతలు సాగునీటి కోసం నానా హైరానా పడేవారు.

కాలువలు శిథిలం.. సాగునీటి వ్యవస్థ అధ్వానం

హెచ్చెల్సీ ప్రధాన కాలువపై ఉన్న వంతెనలు, డిస్ట్రిబ్యూటరీ కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువల్లో కంప చెట్లు పెద్దఎత్తున పెరిగా యి. దర్గాహొన్నూరు, మల్లికేతి, మీనహళ్లి గ్రామాల సమీపంలో వంతెనలు కూలిపోయాయి. మల్లికేతి వద్ద రైతులే చందాలు వేసుకుని వంతెనలు మరమ్మతు చేసుకున్నారు. సాగునీటి కాలువల నిండా మొక్కలు పెరిగి నీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు దెబ్బతిన్నాయి. ఆరేళ్లుగా నిధులు లేక మరమ్మ తులు జరగక కాలువలన్నీ పాడుబడ్డాయి. కాలువల నిండా నీరున్నా చివరి ఆయకట్టు భూములకు సాగు నీరు అందక రైతులు అల్లాడిపోయేవారు. నీటి పంపిణీ వ్యవస్థపై అజమాయిషీ చేసే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. దీంతో రైతులు సాగునీటి కష్టాలతోనే ఐదేళ్లు గడిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇటీవలే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. దీంతో తమ కష్టాలు తీరినట్లేనని రైతులు భావిస్తున్నారు.

సంఘాలదే బాధ్యత

నీటిపంపిణీ వ్యవస్థలో అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే. సాగునీటి సంఘాలు కీలకం కానున్నాయి. నీటి సరఫరా సమస్యల పరిష్కారంలో సంఘాలు క్షేత్రస్థాయిలో నిత్యం రైతులకు అందు బాటులో ఉంటాయి. ఏ కాలువలపై సమస్య తలెత్తినా అధికారుల కంటే ముందు సంఘాల సభ్యులు ముందు ఉంటారు. ఎక్కడైనా కాలువలకు గండి పడినా, కట్టలు పగిలిపోయినా, నీటి పారుదలకు సమస్యలు ఏర్పడినా వెంటనే సంఘాలు స్పందించి సమస్యలను పరిష్కరిస్తాయి. సంఘాలు పటిష్టంగా పని చేస్తే నీటికష్టాల నుంచి రైతులు గట్టెక్కే అవకాశం ఉంటుంది. సాగునీటి కాలువల నిర్వహణను వైసీపీ ప్రభు త్వం ఐదేళ్లు గాలికొదిలేసింది. కాలువల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తిరువా చెల్లిస్తారు. అయినా సాగునీటి సంఘాలకు వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా, సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించింది.

కేటాయింపులకు ముందే టెండర్లు

తుంగభద్ర ఎగువ కాలువలో నీటి సరఫరాకు ఎదురయ్యే ఆటంకాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. వచ్చే ఏడాదికల్లా కొన్ని శాశ్వత మరమ్మతులు చేసి నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. చేయాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈక్రమంలోనే రూ. 35 కోట్ల పనులకు పరిపాలన అనుమతులను తీసుకుని నెల రోజుల కిందట టెండర్లు పిలిచారు. నీటి సరఫరా ఆగిపోగానే పనులను చేయాలనే సంకల్పంతో ప్రక్రియను సిద్ధం చేసుకుని బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల కోసం నిరీక్షిస్తూ వచ్చారు. చర్లోపల్లి 119-637 కిలోమీటర్ వద్ద అండర్ టన్నెల్ మరమ్మతులకు రూ. 50లక్షలతో, 1వ డిస్ట్రిబ్యూటరీ షట్టర్, కాలువ మరమ్మతులు పనులకు రూ.25 లక్షలు, 112-200కిలో రూ. 12 లక్షలు, 117-200 కిలోమీటర్ వద్ద రూ.2.50 లక్షలతో పాటు మిగతా అత్యవసర పనులు మరమ్మతులు కోసం రూ. 35 కోట్లకు టెండర్లు కూడా అయినట్లు అధికారులు తెలిపారు. తర్వలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. లైనింగ్ పనులు, అవుట్‌పాల్, రెగ్యులేటర్, పనులు, కూలిపోయిన, శిథిలవస్థకు చేరిన వంతెనలు నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు. పనులు చేసిన వెంటనే నిధుల విడుదలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా బడ్జెట్‌లో రూ. 37 కోట్లు వీటి కోసం కేటాయించారు.

హెచ్చెల్సీని నిర్వీర్యం చేసిన వైసీపీ : కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ విప్

గత వైసీపీ ప్రభుత్వం హెచ్చెల్సీని ఐదేళ్ల కాలంలో నిర్వీర్యం చేసింది. ఆధునికీకరణ పనులు పూర్తి చేయకపోవడం వల్ల ప్రతి ఏటా ఎక్కడో ఒక్కచోట కాలువకు గండి పడి నీరంతా వృథా అయ్యింది. జిల్లా ప్రజలకు తాగు, సాగునీటి అవసరాలకు జీవనాధారమైన తుంగభద్ర ఎగువ కాలువకు కనీసం మరమ్మతులు చేయకపోవడంతో చాలా బాధ కలిగేది. ఇదే విషయంగా గత వైసీపీ ప్రభుత్వానికి, కలెక్టర్లకు పలుమార్లు లేఖలు రాసిన పట్టించుకోలేదు. అత్యవసర మరమ్మతుల కోసం నిధులను కేటాయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక బడ్జెట్‌లో అత్య వసర పనుల కోసం రూ. 37 కోట్లు కేటాయించింది. త్వరలో పనులు కూడా ప్రారంభం అవుతాయి.



అధ్వానంగా ఉన్న హెచ్ బ్రాంచ్ కాలువ ←

మైలాపురం వద్ద దెబ్బతిన్న ప్రధాన కాలువ →



మృత్యువులోనూ తోడుగా తోబుట్టువులు



రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతి

ఓ చిన్నారి కూడా..

అదే కుటుంబంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు

అరటి ఎగుమతులను మరింత ప్రోత్సహిస్తాం


ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ దేవమునిరెడ్డి

(వివరాలు 7లో)



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.29	5.19
సోమవారం సాయంత్రం	మంగళవారం ఉదయం



ఉష్ణోగ్రతలు

ఆదివారం

గరిష్ఠం	37.0
కనిష్ఠం	22.0

చివరి తడులు పెట్టుకోండి..

నాలుగు రోజుల్లో హంద్రీనీవాకు నీరు బంద్

కోటా పూర్తితో కృష్ణా బోర్డు నిర్ణయం

హెచ్ఎన్ఎస్ఎస్ అధికారుల సూచన



జీ కొట్టాల వద్ద హంద్రీనీవా కాలువ

గుంతకల్లు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మరో నాలుగైదు రోజుల్లో హంద్రీనీవాకు సాగునీటి ఎత్తిపోతలను నిలిపివేస్తున్నామని, చివరి తడులు అవసరమైనవారు పెట్టుకోవాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు సూచిస్తున్నారు. శ్రీశైలం డ్యాంలో నీరు పుష్కలంగా ఉండగానే హంద్రీనీవాకు ఎత్తిపోతలను నిలిపివేయాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంటు బోర్డు నిర్ణయించింది. హంద్రీనీవాకు గత ఆగస్టు 1వ తేదీన మల్యాల పంప్ హౌస్ వద్ద నీటి ఎత్తిపోతలను ప్రారంభించారు. దాదాపు 1200 క్యూసెక్కుల స్థాయిలో 215 రోజుల పాటు డ్యాం నుంచి వాటర్ లిఫ్టింగ్ కార్యక్రమం ఏకధాటిగా కొనసాగింది. దీంతో ఈ సంవత్సరం రైతులకు సాగునీరు పుష్కలంగా లభించి కంది, మిర్చి పంటలను సాగుచేశారు. దాదాపు అన్ని పంటల కోతలు పూర్తికాగా, మిర్చికి మరో పదిహేను రోజుల్లో చివరి కోత కూడా పూర్తికానుంది. ఈ నేపథ్యంలో హంద్రీనీవాకు ఇవ్వాల్సిన 40 టీఎంసీల వరదనీటి కోటా పూర్తి కావడంతో డ్యాంలు పుష్కలంగా నీరు (847.7 అడుగుల స్థాయిలో) ఉన్నా, హంద్రీనీవాలో ఎత్తిపోతల కార్యక్రమాన్ని చాలించాలని కృష్ణా నదీ జలాల నిర్వహణ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు త్వరలో హెచ్ఎన్ఎస్ఎస్‌లో వాటర్ లిఫ్టింగ్‌ను నిలిపివేస్తామని, పంటలకు తడులు పెట్టుకోదలిస్తే త్వరగా పెట్టుకోవాలంటూ హంద్రీనీవా అధికారులు కెనాల్ పరివాహిక ప్రాంత రైతులకు సమాచారాన్ని తెలిపారు. ప్రస్తుతం 3 పంపులతో దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీరు జిల్లాలోకి వస్తోంది.

అమరావతికి సైకిల్ యాత్ర



టవర్‌క్లాక్ వద్ద సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న సమీరాఖాన్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం నుంచి అమరావతికి పర్వతారోహకురాలు సమీరాఖాన్ సైకిల్ యాత్ర చేపట్టారు. ఆదివారం ఉదయం టవర్‌క్లాక్ వద్ద సైకిల్ యాత్రను ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన తనకు పర్వతాలు అధిరోహించడం, సాహసాలు చేయడం ఎంతో ఇష్టమని తెలిపారు. ఎవరెస్ట్ పర్వతం అధిరోహించడం తన లక్ష్యమన్నారు. రాజధాని అమరావతికి వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంతి నారా లోకేశ్‌ను కలిసి, సాయం కోరతానన్నారు. ప్రభుత్వం సహకరిస్తే ఎవరెస్ట్ పర్వతాన్ని ఎక్కి జిల్లా, రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా చాటుతానని సమీరాఖాన్ తెలిపారు. ఏడు దేశాల్లో ఒంటరిగానే సైకిల్ యాత్ర పూర్తి చేశానన్నారు. ఎంజా, అమెదాబ్లం పర్వతాలను ఎక్కానని తెలిపారు.

సీఎంవి దిగజారుడు వ్యాఖ్యలు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ మంత్రి శైలజానాథ్



మాట్లాడుతున్న వైసీపీ నేతలు

అనంతపురం క్రైం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి శైలజానాథ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వైసీపీకి డైరెక్ట్‌గా కానీ, ఇన్ డైరెక్ట్‌గా కానీ పనులు చేసే పరిస్థితి ఏ స్థాయిలోనూ రాకూడదు. అలా చేస్తే పాముకు పాలు పోసినట్టేనంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని, తక్షణం ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు అందరినీ సమానంగా చూడాలని తెలిపారు. చంద్రబాబు తన స్థాయిని దిగజార్చుకున్నారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలకు సంక్షేమం, అభివృద్ధి అందకూడదంటే ఎలా అని ప్రశ్నించారు. టీడీపీ, బీజేపీ, జనసేన వాళ్లకు మాత్రమే చంద్రబాబు ముఖ్యమంత్రా..? అని ప్రశ్నించారు. సీఎం, మంత్రులు రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాలన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూశారని అన్నారు. జగన్, ఆయన కుటుంబ సభ్యులపై కూటమి నేతలు పోస్టింగ్స్ పెడుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. టీడీపీ కూటమికి చట్టం చుట్టమా..? అని ప్రశ్నించారు.

నేడు కలెక్టరేట్‌లోనే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురంటౌన్, మార్చి2(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోనే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. తొలుత రాప్తాడులో ఏర్పాటు చేయాలనుకున్నామన్నారు. అనివార్య కారణాల వల్ల కలెక్టరేట్‌లో నిర్వహించదలిమన్నారు. జిల్లాప్రజలు గమనించాలని కోరారు.

మాట తప్పడం వైసీపీకే చెల్లు

ఐదేళ్లలో ప్రాజెక్టులకు పైసా ఇవ్వలేదు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు

అనంతపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తప్పుడు మాటలు చెప్పే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని, మాట తప్పడం.. మడమ తిప్పడం వైసీపీకే చెల్లు అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డితో కలిసి వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో ఏనాడైనా ప్రాజెక్టులకు ఒక్క పైసా విదిల్చారా..? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాజెక్టులకు వేలకోట్లు నిధులు కేటాయించిన విషయాన్ని మరిచిపోయి అనంత వెంకటరామిరెడ్డి విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హోదాలో పయ్యావుల కేశవ్ చొరవను అభినందించాలని వైసీపీకి హితవు పలికారు. వైసీపీ మాదిరిగా తప్పుడు మాటలు చెప్పి కూటమి ప్రభుత్వం దగా చేయలేదన్నారు. రాయలసీమకు అన్యాయం చేసింది జగన్‌రెడ్డే అన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు అమలుకు నోచుకున్నాయంటే అది తెలుగుదేశం హయాంలోనే అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్రంతో కలిపి ఏడాదికి రూ. 20వేలు త్వరలో అందించబోతున్నామన్నారు. వైసీపీ పాలనలో కేంద్రం సొమ్ముతో కలిపి రూ. 13,500 ఇస్తే.. తమ ప్రభుత్వం రూ. 20 వేలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. మీ హయాంలో వారికి డీఏలు, ఐఆర్‌లు ఇచ్చారా..? ఎవరు మోసం చేశారో అందరికి తెలుసు అన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మృత్యువులోనూ తోడుగా తోబుట్టువులు..



సరస్వతి, నీలావతి, యోగేశ్వరమ్మ, చిన్నారి విద్యశ్రీ (ఫైల్)

ఓ చిన్నారి కూడా..

అదే కుటుంబంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతి

నలుగురు అక్కాచెల్లెళ్లు..
ప్రేమానురాగాలతో పెరిగారు..
పెళ్లిళ్లయ్యాయి.. పిల్లలూ కలిగారు..
చిన్న చెల్లి.. కాన్పు అయింది..
పండంటి ఆడబిడ్డతో అత్తారింటికి
బయల్దేరింది..
అక్కలూ వచ్చారు..
చెల్లికి దుస్తులు పెట్టి..
పుట్టింట్లో అందరూ
ఆనందంగా గడిపారు..
చెల్లి ఆటోలో పయనమైంది..
అక్కలు కూడా వెంట వెళ్లారు..
పిల్లలతో కలిసి..
కబుర్లు చెప్పుకుంటూ..
సాగిపోతున్నారు..
మృత్యువు
కారు రూపంలో దూసుకొచ్చింది..
అతివేగంగా ఢీకొట్టడంతో
చెల్లాచెదురుగా పడిపోయారు..
అత్తారింటికి బయల్దేరిన చెల్లి..
అక్కడే కన్నుమూసింది..
ఆమె మూడు నెలల పసిబిడ్డ,
ఇద్దరు అక్కలు
ప్రాణాలు కోల్పోయారు..
తోబుట్టువులు ముగ్గురూ
కన్నుమూయడంతో
ఆయా కుటుంబాల్లో
విషాదఛాయలు
అలుముకున్నాయి..
వారి పిల్లలు ఆస్పత్రి
పాలయ్యారు..

కూడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో అక్కచెల్లెళ్లు సరస్వతి (34), నీలావతి(45), యోగేశ్వరమ్మ (40) మృతిచెందారు. సరస్వతి మూడు నెలల కుమార్తె విద్యశ్రీ కూడా మరణించింది. యోగేశ్వరమ్మ రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరి, నీలావతి కుమారుడు అచ్యుత్‌కుమార్, ఆటోడ్రైవర్ లోకేశ్ తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కారులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కూడేరు అప్‌గ్రేడ్ సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన బసవరాజు, పార్వతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె పుష్పావతిని మర్తాడుకే చెందిన వ్యక్తికిచ్చి వివాహం చేశారు. రెండో కుమార్తె నీలావతిని అనంతపురం జిల్లా కుందుర్పి మండలం అప్పిలేపల్లికి చెందిన శ్రీకంఠకిచ్చి పెళ్లి చేశారు. ప్రస్తుతం వీరు జిల్లాలోని బుక్కరాయసముద్రం మండలం వడియంపేటలో నివాసముంటున్నారు. వీరికి అచ్యుత్‌కుమార్ సంతానం. మూడో కుమార్తె యోగేశ్వరమ్మకు జిల్లాలోని కణేకల్లు మండలం పులిచెర్లకు చెందిన మహాబలేశ్వరప్పతో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరి సంతానం. నాలుగో కుమార్తె సరస్వతికి జిల్లాలోని ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన సతీష్‌కుమార్‌తో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమార్తె జ్యోత్స్న ఉంది. సతీష్‌కుమార్ వంట పనులకు వెళ్తుండేవాడు. ఓ మినీ బ్యాంకులో పనిచేస్తుండేవాడు. సరస్వతి కాన్పు నిమిత్తం పుట్టింటికి వచ్చింది. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ విద్యశ్రీకి మూడు నెలలు నిండడంతో అత్తారింటికి బయల్దేరేందుకు సిద్ధమైంది. సరస్వతి తండ్రి బసవరాజు గతంలోనే మరణించాడు. తల్లి పార్వతమ్మ.. బిడ్డకు ఏలోటూ రాకుండా చూసుకుంది. ఆదివారం సరస్వతికి దుస్తులు పెట్టింది. కార్యక్రమానికి సరస్వతి అక్కలు హాజరయ్యారు. అందరూ ఆనందంగా గడిపారు. అనంతరం లోకేశ్‌కు చెందిన ఆటోలో రాయంపల్లికి బయల్దేరారు. యోగేశ్వరమ్మ రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరితో కలిసి ఆటోలో ఉరవకొండ వెళ్లి అటు నుంచి అత్తగారి ఊరైన పులిచెర్లకు వెళ్దామని బయల్దేరింది. నీలావతి కూడా చెల్లిని వదిలిపెట్టి వద్దామని ఆటోలో కుమారుడు అచ్యుత్‌కుమార్‌తో కలిసి బయల్దేరింది.





ప్రమాదంలో నుజ్జయిన ఆటో, విషాదంలో సరస్వతి భర్త సతీష్‌కుమార్

దూసుకొచ్చిన మృత్యువు

అక్కచెల్లెళ్లు ఆనందంగా పిల్లలతో పయనమయ్యారు. కూడేరు మండలం కమ్మూరు క్రాస్ సమీపంలోకి రాగానే మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చింది. ఉరవకొండ వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. అందులోని సరస్వతి అక్కడికక్కడే మృతిచెందింది. మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ రాజు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను తన వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మూడు నెలల చిన్నారి విద్యశ్రీతోపాటు నీలావతి, యోగేశ్వరమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆటో డ్రైవర్ లోకేశ్, అచ్యుత్‌కుమార్, చిన్నారి జ్ఞానేశ్వరి చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి పెద్దఎత్తున చేరుకున్నారు. మార్చురీలో విగత జీవులుగా పడి ఉన్న తమ వారిని చూసి బోరున విలపించారు. భార్య సరస్వతి, కుమార్తె విద్యశ్రీ మరణించడంతో సతీష్‌కుమార్ కన్నీరు పెట్టుకున్నాడు. మూడు నెలలకే వందేళ్లు నిండాయా తల్లీ అంటూ బిడ్డను చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు. కారులో ఇంజనీరింగ్ విద్యార్థులు కావ్య, కవిత, రంజిత్, యశ్వంత్, తరుణ్ ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో కావ్య, కవిత, రంజిత్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రమాద స్థలాన్ని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు.

నీటిగుంతలో పడి చిన్నారి మృతి



గౌతమ్ నంద మృతదేహం

తాడిపత్రి, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపాన నల్లబండల ఫ్యాక్టరీలో చిన్నారి గౌతమ్ నంద (3) ఆదివారం ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పామిడికి చెందిన గంగరాజు, దీవెన దంపతులకు కుమారుడు గౌతమ్‌నంద, కుమార్తె ఉన్నారు. వీరు శివరాత్రి పండుగ సందర్భంగా చుక్కలూరు సమీపంలోని బండల ఫ్యాక్టరీలో పనిచేసుకుంటున్న గంగరాజు మేనమామ రామాంజనేయులు ఇంటికొచ్చారు. పండుగ ఆనందంగా చేసుకున్నారు. అందరూ సంతోషంగా ఉన్న సమయంలో ఆదివారం మధ్యాహ్నం గౌతమ్‌నంద ఆడుకుంటూ వెళ్లి నీటిగుంతలో పడ్డాడు. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా కనిపించలేదు. అనుమానం వచ్చి నీటిగుంతలో చూడగా అందులో కనిపించాడు. బయటకు తీసి హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



ప్రేమసాయి (ఫైల్)

నల్లమాడ, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి ప్రేమసాయి (20) పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రేమసాయి చిత్తూరులో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుండేవాడు. ఐదురోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆదివారం నొప్పి ఎక్కువగా రావడంతో మనస్తాపం చెంది పొలానికి వెళ్లి పురుగు మందు తాగి, అపస్మారక స్థితిలో పడిపోయాడు. కాసేపటికి గుర్తించిన తండ్రి వెంకటపతి.. ప్రేమసాయిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. వెంకటపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తొలి పూజలందుకున్న పోతలయ్య స్వామి

దర్శించుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



ప్రత్యేకాలంకరణలో పోతలయ్యస్వామి

కనగానపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరులో వెలిసిన పోతలయ్య స్వామి తొలి పూజలందుకోవడంతో దాదాలూరు పరుష ప్రారంభమైంది. కలికవాండ్లపల్లికి చెందిన బీజారీ వంశీకులు ఆదివారం యలవగంపలో ఆభరణాలు, పూలను తీసుకొచ్చి పోతలయ్యస్వామికి సమర్పించారు. పోతురాజులు నృత్యం చేస్తూ యలవగంపను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించి పూజలు చేశారు. సోమవారం జ్యోతులు, పలహారపుబండ్లతో ఆలయ ప్రదక్షిణ చేస్తారు. మంగళవారం పోతురాజులు నల్లని మేకపిల్లను గావులు పట్టి స్వామికి నైవేద్యంగా సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాదులూరు గ్రామానికి వచ్చిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా చెన్నకేశవ స్వామిని, అనంతరం పోతలయ్య, బంగారు లింగమయ్య స్వాములను దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి, పోతలయ్య, రాజప్ప, బాలు, వెంకటరాముడు, ఆదెప్ప, ప్రసాద్, ఓబులేష్, రవి, లింగమయ్య పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

● బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ● జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లోనూ మహిళలు ముందుండాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. టీడీపీ హయాంలోనే మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ట్రైనీ టైలర్, ఆపరేటర్లుగా అవకాశాలు కల్పించామని అన్నారు. ట్రైనింగ్‌లో వారికి గౌరవవేతనం ఇస్తారన్నారు. 500 మంది దాకా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిన్నవెంకటరాముడు, కేశవయ్య, సూరి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, శ్రీరాములు, సిద్ధయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల వద్ద ముళ్ల కంపలో 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని కసాపురం పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడని వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరటి ఎగుమతులను మరింత ప్రోత్సహిస్తాం

ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ దేవమునిరెడ్డి

యూరప్ కంపెనీ ప్రతినిధితో కలిసి పలుచోట్ల పరిశీలన



అరటి పంటను పరిశీలిస్తున్న దేవమునిరెడ్డి, యూరప్ ప్రతినిధి పాట్రిక్

అనంతపురం అర్బన్/రాప్తాడు/పుట్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి అరటి ఎగుమతులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ దేవమునిరెడ్డి పేర్కొన్నారు. యూరోప్ దేశానికి చెందిన ఫెయిర్‌ట్రాసా కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాట్రిక్ స్ట్రూబిలో కలిసి ఆయన ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అరటి పంట సాగు, ఎగుమతి పద్ధతులపై ఆరా తీశారు. రాప్తాడు మండలం రామినేపల్లిలోని అరటి టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను సందర్శించారు. ల్యాబ్‌లో ఉత్పత్తి చేస్తున్న అరటి మొక్కల వివరాలపై ఆరా తీశారు. అనంతరం పుట్లూరు మండలం కడవకల్లులో ఎస్కే బనానా కంపెనీ ఆధ్వర్యంలో అరటి గెలల సేకరణ, ప్యాకింగ్‌ను పరిశీలించారు. అరటి తోటల నుంచి గెలలు ఎలా సేకరిస్తున్నారు, వాటిని 13కిలోలు, 7కిలోల బాక్సుల్లో ప్యాకింగ్ ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఫ్రూట్‌కేర్ భాగంగా అరటిగెలలను అధిక సూర్యరశ్మి, దుమ్ము పురుగుల తాకిడి నుంచి అరికట్టడానికి రైతులు పాటిస్తున్న కవర్ల వినియోగాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత తాడిపత్రి మండలం చుక్కలూరులో కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌ను సందర్శించారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వారిని కలిసి పలు అంశాలపై చర్చించారు. తాడిపత్రి, అనంతపురంలోని పలు ప్రాంతాల నుంచి అరటి, దానిమ్మ ఉత్పత్తులను యూరప్ దేశాలకు ఎగుమతులను ప్రోత్సహించేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నరసింహారావు, హెచ్‌ఓలు రత్నకుమార్, శైలజ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల వాగ్వాదం

ఉరవకొండలో బయట పడ్డ విభేదాలు



వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకులు

ఉరవకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వ కర్మ ట్రైనింగ్ సెంటర్ విషయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకరినొకరు నువ్వెంత అంటే నువ్వెంతనే స్థాయిలో గొడవపడ్డారు. దీంతో అక్కడ గందరగోళం ఏర్పడింది. స్థానిక మహాత్మ జూనియర్ కళాశాలలో పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద చేతి వృత్తుల వారికి గత 15 రోజుల నుంచి శిక్షణ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ వెళ్లారు. శిక్షణ పొందేవారికి సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని నిర్వాహకులపై రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నువ్వెందుకు వచ్చావని జిల్లా అధ్యక్షుడిని నిలదీశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడున్న బీజేపీ నాయకులు ఇద్దరికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. గత కొంత కాలంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మధ్య అంతర్గత విభేదాలు ఉన్నాయి. ఈ సంఘటనతో ఉరవకొండ బీజేపీలో వర్గ విభేదాలు బయటపడ్డాయి.

రాష్ట్రపతి భవన్ నుంచి

చేనేత డిజైనర్‌కు ఆహ్వానం



నాగరాజు

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చినట్టు ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్, చేనేత కార్మికుడు నాగరాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు ప్రోత్సాహం కల్పించడానికి అమృత్ మహోత్సవంలో భాగంగా ధర్మవరం పట్టుచీరల ప్రదర్శన కోసం రాష్ట్రపతి భవన్ నుంచి ఎక్స్‌పో నిర్వహణకు ఆదివారం ఆహ్వానం పంపించారని నాగరాజు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 15న గవర్నర్ విందుకు ఆహ్వానం పంపగా హాజరయ్యానని పేర్కొన్నారు. దేశ రాజధానిలో ధర్మవరం పట్టుచీరల ప్రత్యేకతను తెలియజేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రపతిభవన్‌కు తనతోపాటు చేనేత కార్మికుడు చిప్పల మార్కండేయ రానున్నట్లు వివరించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో శివతేజ సత్తా



బెంగుళూరు పోటీల్లో పాల్గొన్న శివతేజ

అనంతపురం టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డింగ్ పోటీల్లో అనంత యువకుడు చారుగుండ్ల శివతేజ సత్తా చాటాడు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పతకాలు సాధించాడు. ఆదివారం బెంగళూరులోని శంకర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఎస్‌బీఎఫ్‌ఎఫ్ క్లాసిక్ ఆధ్వర్యంలో మిస్టర్ ఇండియా పోటీలు సాగాయి. ఈ పోటీల్లో శివతేజ పాల్గొని వివిధ రాష్ట్రాల బాడీ బిల్డర్లతో పోటీపడి సత్తా చాటాడు. మెన్ ఫిజిక్ 175 సెంటీ మీటర్ల విభాగంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్‌మెడల్ సాధించాడు.

టమోటా కిలో రూ.9



అనంతపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.9తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 300 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారం ప్రథమ కౌన్సిల్ మహాసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, రమేశ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఫోన్‌ద్వారా తన సందేశాన్ని ఉద్యోగులకు వినిపిస్తూ.. ఉద్యోగుల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుందన్నారు. ఉద్యోగుల సమస్యలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి దృష్టికి తీసుకురాగా తక్షణమే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ... పీఆర్సీపై ప్రభుత్వం తక్షణమే జ్యుడిషియల్ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఆలస్యమైన దృష్ట్యా ఐఆర్ ప్రకటించాలని, సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్ల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే ఒక్క డీఏ విడుదల చేయాలన్నారు. మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఎఫ్‌ఆర్‌సీ, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మూడు దశాబ్దాలుగా ఉన్న ఉపాధ్యాయుల ఏకీకృత సమస్యకు తక్షణం పరిష్కారం చూపాలన్నారు. సీపీఎస్ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు పఠాన్ బాజి, అబ్దుల్‌రజాక్, కేదారనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కళాశాల స్టేడియమే..

పీటీసీ మైదానంగా రూపాంతరం..

- 60 ఏళ్ల చరిత్ర
- 10వేల సామర్థ్యంతో నిర్మాణం
- పోలీసుల పెత్తనంపై సర్వత్రా విమర్శలు
- కోచ్‌లు, క్రీడాకారుల తీవ్ర అసంతృప్తి


నీలం సంజీవరెడ్డి స్టేడియం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఒకప్పటి జిల్లా కళాశాల స్టేడియమే, నేటి నీలం సంజీవ రెడ్డి స్టేడియం. రాయలసీమలోనే మొదటి స్టేడియంగా అనంతపురంలో 1964లో నిర్మించారు. కేవలం వాకింగ్, వ్యాయా మం, క్రీడల కోచింగ్, పోటీల నిర్వహణ కోసమే కేటాయించారు. అటువంటి స్టేడియాన్ని పోలీస్ ట్రైనింగ్ కళాశాలకు ఆనుకుని ఉండడంతో పీటీసీ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి నీలం సంజీవరెడ్డి స్టేడియంలో పోలీసుల పెత్తనం పెరుగుతూ వస్తోంది. నిర్వహణ పేరుతో ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి నెలకు రూ. 5చొప్పున ఒకే సమయంలో రూ.300 చెల్లించి సభ్యత్వం పొందాలని గేటుకు అమర్చారు. దీనిపై అటు వాకర్స్, ఇటు క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాకిం గ్, వ్యాయామం చేయడానికి, క్రీడల శిక్షణ, సాధన, ఆడు కోవడానికి నిర్మించిన స్టేడియంలో పోలీసుల ఆంక్షలు పెట్టడం ఏమిటని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

60 ఏళ్ల చరిత్ర కలిగిన స్టేడియం

నీలం సంజీవరెడ్డి స్టేడియం రాయలసీమలోనే మొట మొదటి క్రీడా స్టేడియం. 1964లో జిల్లా కళాశాల స్టేడి యంగా నిర్మించారు. జిల్లా ప్రజలు, ప్రముఖుల విరాళాలతో నిర్మాణం పూర్తి చేశారు. మొదట రూ. 1.77లక్షల తో స్టేడియం నిర్మించగా... సదుపాయాల కల్పన, ప్రజలు కూర్చోవడానికి ఏర్పాట్లు తదితర వాటి మొత్తంగా రూ. 25 లక్షలు ఖర్చు చేశారు. అప్పటి నుంచి ఎన్నో వేడుకలు, క్రీడా పోటీలకు వేదికగా ఉన్న ఆ స్టేడియాన్ని ప్రస్తుతం పీటీసీ పోలీసు అధికారులు పెత్తనం చలాయిస్తున్నారు. స్టేడియంలో శిక్షణ పొందుతున్న కబడ్డీ, అథ్లెటిక్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, పారా అథ్లెటిక్ క్రీడాకా రులు తమ కెరీర్‌లో ఉన్నత స్థానాలకు చేరుతున్నారు. ఇటువంటి స్టేడియంలో ఆటలకు తావులేదు, వేరే చోటకు వెళ్లి పోండి అని ఇప్పుడు పోలీసులు హెచ్చరించడం పట్ల క్రీడాలోకం యావత్తు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితులపై శాప్ చైర్మన్, రాష్ట్ర హోంమంత్రి, జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులకు క్రీడాకారులు, కోచ్‌లు ఇప్పటి కే విన్నవించారు. మరి అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్ణయం ఏమేరకు ఉంటుందో చూడాలి.

ఎన్నో విజయాలు సాధించారు



నీలం సంజీవరెడ్డి స్టేడియం లో ఎన్నో ఏళ్లుగా క్రీడా కా రులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణతో ఎన్నో విజయా లు సాధించారు. ఈ స్ఫూర్తితోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణి స్తున్నారు. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్న నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఆట నేర్చుకోవడం, నేర్పించడానికి చాలా ప్రాధాన్యం ఉంది.

- మంజుల, శాప్ కోచ్

వెళ్లిపొమ్మంటే... ఎక్కడికెళ్లాలి?



ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కోచింగ్ ఇస్తున్నాం. ఎంతోమంది క్రీడా కారులను తీర్చిదిద్దాం. శిక్షణ కు అనువైన ప్రదేశంగా నీలం సంజీవరెడ్డి స్టేడియాన్ని ఎం చుకున్నాం. అటు స్టేడియం నుం చి ఉన్నఫలంగా వెళ్లిపోమం టే... ఎక్కడికెళ్లాలి. పోలీసులు బలవంతంగా క్రీడాకారులను బయటకు నెట్టేస్తున్నారు. ఇది చాలా బాధాకరం. ఎటు వంటి న్యూసెన్సు లేకుండా క్రీడాకారులకు శిక్షణ ఇస్తు న్నాం. దీనిపై పునరాలోచించాల్సిన అవసరం ఉంది.

- అనిల్‌కుమార్, కబడ్డీ కోచ్

స్టేడియంలో ఆడొద్దనడం బాధాకరం



అనంతపురంలో అనుకూలంగా ఉండే ఒకే ఒక్క స్టేడియం ఇది. అటువంటి స్టేడియంలో ప్రా క్టీస్ చేస్తూ, శిక్షణ పొందుతు న్నాం. ఇటువంటి పరిస్థితుల్లో స్టేడియంలో ఆడొద్దండి అని చెప్పడం చాలా బాధాకరంగా ఉం ది. కళాశాల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, యూనివర్సిటీ, జాతీయ స్థాయిలో ఆడాను. వాలీబాల్ క్రీడలో రాణించేం దుకు నీలం సంజీవరెడ్డి స్టేడియంలో శిక్షణ పొంద డంతోనే ఇదంతా సాధ్యమైంది.

- అబ్దుల్‌రహీం, వాలీబాల్ క్రీడాకారుడు

స్టేడియంలో ఆడి అన్నీ సాధించాం



ఈ స్టేడియాన్ని మా సొంత ఇల్లులాగా భావిస్తాం. క్రీడల్లో ఓనమాలు నేర్చుకున్నాం. అ లాంటి స్టేడియంలో ఎన్నో సాధించాం. స్టేడియం వేదికగా ఎంతోమందితో పరిచయాలు ఏర్పడ్డాయి. దీంతో మాకు ఎంతో ప్రయోజనం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో స్టేడియంలో ఆడడానికి వీలు లేదు...వేరేచోట ఆడుకోండి అని పో లీసులు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే అధికారులను కలిసి గోడు వెల్లబోసుకున్నాం. హోంమంత్రి, ఎమ్మెల్యేకు విన్నవించాం.

- మన్సూర్, క్రీడాకారుడు

క్రమశిక్షణతో ప్రాక్టీస్ చేస్తున్నాం



ఎంతో క్రమశిక్షణతో ఉదయం, సాయంత్రం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తు న్నాం. ఇతరులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సాధన చేస్తున్నాం. మా కోచ్‌లు ఇచ్చే సూచనలు, సలహాలు తీసుకుని జాతీయ స్థాయి వరకు పోటీలలో ఆడాం. ఇదంతా నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ప్రాక్టీస్ చేయడంతోనే సాధ్యమైంది.

- సాగుప్తా అఫ్రీన్, క్రీడాకారిణి

నిర్వహణ కోసం వసూలు చేస్తున్నారు



స్టేడియం నిర్వహణ కోసం ఆరు నెలలకు రూ.300 చొప్పున వ సూలు చేస్తున్న మాట వాస్తవమే. స్టేడియాన్ని శుభ్రం గా ఉంచడానికి, నిర్వహణకు మొత్తం ఉపయోగిస్తున్నారు. స్టేడి యంలో వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్, కబడ్డీ, క్రికెట్ కోచింగ్ ఇస్తున్నారు. కొంత మంది క్రీడాకారుల ప్రవర్తనతో వాకర్స్ ఇబ్బందులకు గురవుతు న్న మాట నిజం. క్రీడాకారులకు హెచ్చరికలతో పరిస్థితిని సరిచేయగలరు. పోలీసులకు క్రీడాకారులు, కోచ్‌లు కూడా సహకరించాలి.

- సుధాకర్‌బాబు, నీలం సంజీవరెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

స్టేడియం చరిత్రలో ముఖ్య ఘట్టాలు

- 1963-64లో రంజీ ట్రోఫీ సందర్భంగా 1964లో ఈ స్టేడియంలో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ నిర్వహించారు. ఆ మ్యాచ్ లో ఆంధ్రప్రదేశ్, మద్రాస్‌కు చెందిన క్రికెట్ జట్లు తలపడ్డాయి.
- 1986-87లో రంజీట్రోఫీ ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా బొంబయి ఆడింది. 1964నుంచి 1986 వరకు ఈ స్టేడియంలో మరో నాలుగు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ లు జరిగాయి.
- 2017 నవంబరు 5న సినీతారల క్రీసెంట్ క్రికెట్ కప్ పోటీలు నిర్వహించారు. ఇందులో సినీ పరిశ్రమకు చెందిన 30మంది హీరోలు, 15 మంది హీరోయిన్లు పాల్గొన్నారు.
- 2013 డిసెంబరు 23న నీలం సంజీవరెడ్డి శత జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు అప్పటి భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.
- 2017లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున 70వ స్వా తంత్ర్య దినోత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అప్ప టి ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.

న్యూస్ బాక్స్

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

రాప్తాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో జరిగిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికను వెల్ల డించేందుకు మంగళవారం ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ సావిత్రి పత్రికా ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక నిర్వహిస్తా మన్నారు. సామాజిక తనిఖీలో వెల్లడైన అంశాలను తెలియజే స్తారన్నారు. ఉపాధి హామీ అనుబంధ శాఖల అధికారులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని తెలిపారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

రాప్తాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మిరప. పత్తి, పప్పుశనగ, సీడ్స్ జొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ ఉరవకొండ నుంచి అనంతపురం కలెక్టరేట్ వరకు నిర్వహించే పాదయాత్ర విజయ వంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినే యులు పిలుపునిచ్చారు. పాదయాత్ర పోస్టర్లను ఆదివారం రైతు లతో కలిసి రాప్తాడులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్వింటా మిరప కు రూ. 50 వేలు, పప్పు శనగ రూ.10 వేలు, సీడ్స్‌జొన్నకు రూ.10 వేల ప్రకారం గిట్టు బాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, సుబ్బిరెడ్డి, పోతులయ్య, హరీష్, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారు దూసుకెళ్లి ఐదు గొర్రెల మృతి

చెన్నేకొత్తపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎ్ స గేటు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం గొర్రెల మందపై ఓ కారు దూసుకెళ్లింది. గంగాద్రి అనే వ్యక్తికి చెందిన గొర్రెల మంద రోడ్డు దాటుతుండగా కారు దూసుకెళ్లింది. దీంతో ఐదు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలి పారు. కాగా ఈ ప్రమాదంలో కాపరి గంగాద్రికి గాయాలు కావ డంతో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టీచర్లతోనే విద్యార్థుల్లో మార్పు

- సమగ్రశిక్ష ఏపీసీ శైలజ


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ శైలజ

అనంతపురం విద్య, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శాస్త్రీయ వైఖరిని, ఆలోచనా దృక్పథాన్ని టీచర్లు మార్చగలరని సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశా లలో ఆదివారం జిల్లా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం, సీకెదాస్ అకాడమీ ఆధ్వర్యంలో సైన్స్ సెమినార్ -2025 నిర్వహించారు. సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ముఖ్యఅతిథిగా, హెల్త్‌కేర్ కన్స ల్టెంట్ డాక్టర్ మురళీధర్, వరంగల్ ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రామచంద్రయ్య ప్రధాన వక్తలుగా హాజరై మాట్లాడారు. ఏపీసీ శైలజ మాట్లాడు తూ...నిత్య జీవితంలో పిల్లలు శాస్త్రీయ కోణంలో ప్రతి అంశాన్ని చూసేలా, టీచర్లతో పాటు తల్లిదండ్రులు నేర్పించాలన్నారు. మురళీ ధర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో టీచర్ల పాత్ర చాలా కీలకమైందన్నారు. రామచంద్రయ్య మాట్లాడుతూ... విద్యార్థులను బాల్యం నుంచే మానవతావాదులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో టీచర్లు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, ఎన్‌జీసీ ప్రాంతీయ సమన్వయ కర్త ఆనందభాస్కర్‌రెడ్డి, సైన్స్ ఫోరం ప్రతినిధులు మధుసూదన, వెంకటరంగయ్య, మదన్‌మోహన్, రామచంద్ర, ఓబుళరెడ్డి, రాము, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

- సీపీఐ నాయకులు



ఇంటి పట్టాల దరఖాస్తులను తీసుకుంటున్న సీపీఐ నాయకులు

అనంతపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అన్నారు. ఈ నెల 4వ తేదీన ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేసే విషయంపై మండలంలోని కక్కలపల్లి కా లనీ ఐజీ నగర్‌లో ఆదివారం సమావేశం నిర్వ హించారు. సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున హాజరయ్యా రు. ఈ సందర్భంగా స్థానికంగా ఎన్నో ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ని వాసముంటున్న వారితో ఇళ్ల పట్టాల కోసం నాయకులు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ..సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ఈ నెల 4న అనంతపురం ఆర్డీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున్న ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రూరల్ మండలం కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, నాయకులు అక్కులన్న, విజయ్, కుళ్లాయప్ప, ప్రభాకర్ నాయుడు, బసిరెడ్డి, సల్మాన్, ముత్యాలు, చౌడమ్మ, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి ఏకాంతసేవ

తాడిపత్రి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలిం గేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఏకాంత సేవతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చ కులు ఉదయమే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేసి ఏకాంతసేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.


ఏకాంతసేవలో బుగ్గ రామలింగేశ్వరస్వామి

సీఎం మాటలను వక్రీకరిస్తున్నారు

- మాజీ మేయర్ స్వరూప

అనంతపురం అర్బన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు మాటలను వక్రీకరించడం వైసీపీ నాయకుల కు తగదని మాజీ మేయర్ స్వరూప ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు మాటలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఆ పార్టీ నాయకు డు శైలజానాథ్ వక్రీకరించడం హాస్యాస్పద మన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తుందని, ప్రజ లకు మేలు చేసే పనులు, అభివృద్ధి కార్యక్ర మాలు నిష్పక్షపాతంగా అమలవుతాయని అన్నారు. టీడీపీ మద్దతుదారులుగా నిలిచిన వారికి మరింత ప్రోత్సాహం అందిస్తామని సీఎం పేర్కొన్నారన్నారు. సీఎం ప్రసంగాన్ని వక్రీకరించి, అసత్యప్రచారం చేయ డం అనాగరిక రాజకీయమన్నారు. వైసీపీ పాలన లో భయానక వాతావరణాన్ని సృష్టించారని, అభివృద్ధిని అడ్డుకున్నారని, నిధులను దారి మళ్లించారని మండిపడ్డారు. వైసీపీ వక్రీకరణ ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు తమకు మంచి పాలన అందించి, సంక్షేమ ఫలాలు అందిస్తారని అన్ని వర్గాల ప్రజలకు నమ్మకం ఉందన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామం లో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలు చూపరుల ను ఆకట్టుకున్నాయి. శిల్పారామం ఆధ్వర్యంలో ఆదివారం నగరానికి చెందిన తన్మయి, సహస్ర, చంద్రలేఖ, పరిణీతసాయి బృందం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ని ర్వహించారు. పుష్పాంజలి, నమామి, తాండ వ, శంభో శివ శంభో, అన్నింటా నేరుపరి, కో లాపురి, ఆదిదేవుడు, జయ జయ త్రిపురంజ య, భజమానస విఘ్నేశ్వరం వంటివాటి గీతా లకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.13 లక్షలు

అనంతపురం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మా ర్కెట్‌కు పశులసంతతో రూ. 4,13,860 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శని వారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,53,890, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1,59,970 వచ్చిందని ఆయన తెలిపారు.

క్రైస్తవులకు బడ్జెట్ కేటాయింపుపై హర్షం


ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతల ప్లకార్డులు ప్రదర్శిస్తున్న క్రిస్టియన్లు

కనగానపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రైస్తవులకు పెద్దపీట వేయడం ఆనందదాయకమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు పేర్కొన్నారు. బడ్జెట్‌లో క్రైస్తవులకు పెద్దపీట వేయడంపై మండలంలోని నరసంపల్లి బేతేలు ప్రార్థన మంది రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం క్రిస్టియన్ కార్పొరేషన్ కుదేల్ చేశారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమర చంద్రశేఖర్, శ్రీరాములు, కృపాదాసు, యోహన్, దావీదు, రామన్న, సురేష్, దయానందా, పేతేరు, మోష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష లింగాల నిమజ్జనోత్సవం

అనంతపురం కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లక్షలింగ నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివబాలయోగి ఆశ్రమంలో ఫిబ్రవరి 26న 1.30లక్షల మట్టి శివలింగాలతో లింగార్చన చేశారు. ఆదివారం సాయంత్రం నగర శివారులోని చెరువుకట్ట వద్ద చెరువులో గంగమ్మకు సారె సమర్పించి, అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ లింగాలన్నింటిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, కలవల మల్లికార్జున, చిప్పగిరి సురేష్, దేవరాజు, మహేష్‌బాబు, చెన్నకేశవు లు, పిన్ను శ్రీనివాసులు, విశ్వనాథం, లక్ష్మీనారాయణ, నాగభూషణం, నామా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మట్టి శివలింగాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

రేపటి నుంచి చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): వందల ఏళ్ల చరిత్ర కలిగిన గవిమఠం ఉరవకొండకే తలమానికంగా నిలుస్తోంది. విశిష్టతకు మారుపేరుగా విరాజిల్లు తోంది. ఇక్కడ వెలసిన గవిమఠ స్థితచంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శైవమత ప్రచారం కోసం దాదాపు రెండు దశాబ్దాల కిందట ఇక్కడ కరిబసవరాజేంద్రస్వామి మఠాన్ని స్థాపిం చారు. ఈ మఠంలో ఒక గుహ ఉంది. ఈ ప్రాంతంలోనే పీఠాధిపతులు ధ్యానం, తపస్సులు, యజ్ఞాలు నిర్వహించేవారు. గుహ ఉన్నచోటునే గవిగా ప్రాచుర్యమైంది. దీంతో గవిమఠంగా పేరు స్థిరపడింది. కరిబసవరాజేంద్ర స్వామితో పాటు పలువురు మఠాధిపతులు ఎన్నో మహిమాన్విత కార్యక్ర మాలతోమఠానికి అత్యంతప్రాధాన్యత తెచ్చారు. దాదాపుగా 770మఠాలను తమ అనుబంధంగా వివిధ రాష్ట్రాలలో ఏర్పాటు చేశారు. మఠం అనతి కాలంలోనే అభివృద్ధి చెందడంతో ఇక్కడ వెలసిన గవిమఠ స్థితచంద్రమౌళీ శ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూవస్తున్నారు. 1814నుంచి ప్రతి యేటా ఇక్కడ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలు ఇలా...

చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 4వ తేదీన కంకణధారణతో ప్రారంభం కానున్నాయి. 5న నాగాభరణం, 6న నెమలి వాహనోత్సవం, 7న అడ్డపల్లకీ ఉత్సవం, ఐరావతవాహనోత్సవం, 8న బసవేశ్వరవాహనోత్సవం, 9నమహారథోత్సవం, 10న లంకాదహనం, 11న అశ్వవాహనం, వసంతోత్స వంతో ఉత్సవాలు ముగుస్తాయని అసిస్టెంట్ కమిషనర్ రాణి తెలిపారు. బ్రహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

రాజకీయాలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ పంపిణీ

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా సీఎం చంద్రబాబునాయుడు సీఎంఆర్ఎఫ్ నిధులు విడుద ల చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాల యంలో ఇద్దరికి మంజూరైన రూ.2.54 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజే శారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలి యజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు నియోజక వర్గంలోని 50మందికి తొమ్మిది విడతల్లో రూ.69.16 లక్షలు సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందించామన్నారు. నియోజకవర్గంలోని బాధితులు అడిగిన వెంటనే సీఎం చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ నిధులు విడుదల చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, పరమేశ్వరన్, ముక్తియార్, చేపల హరి, గోళ్ల సుధాకర్‌నాయుడు, సైఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి

అనంతపురం అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో అనంతపురం అర్బన్ పరిధిలోని మసీదుల్లో ఎలాంటి అసౌకర్యాలు ఉండకూడదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదివారం ఆదేశించారు. రంజాన్ మాసం సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని మసీదుల్లో ఉపవాస దీక్ష విరమణ, ప్రార్థనల సమయంలో విద్యుత్, నీటి సమస్యలు తలెత్తకుండా చూడా లన్నారు. ఇప్పటికే గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

ట్రూ అప్ చార్జీల వసూలు నిలిపివేయాలి

- పట్టణ పౌర సంఘాల నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

అనంత పురం రూరల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ పేరు తో చేస్తున్న అదన పు చార్జీల వసూ లును వెంటనే ని లిపివేయాలని ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని పాతూరు కన్య కాపరమేశ్వరి ఆలయంలో విద్యుత్ సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా యూనిట్ అధ్యక్షుడు రసూల్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఆంజనే యులు, అనంతపురం యూనిట్ గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. విద్యుత్ సంస్కరణలపై పలు డిమాండ్ల పరిష్కారం కోసం రాజకీయ, ప్రజాసంఘాలతో కలసి ప్రజాస్వామ్య బద్ధంగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెన్నపూస రవీంద్రరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాదాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

విభజన హక్కులను హరించిన కేంద్రం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం సెంట్రల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజనలో భాగంగా పొందాల్సిన హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తూ వస్తోందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ విభాగం మూడో మహాసభలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ గేయానంద్‌తోపాటు హైదరా బాద్ సెం ట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి జార్జీమేరి హాజరై వేడుకలు ప్రారంభించి మాట్లాడా రు. అధోగతి నుంచి అభివృద్ధి వైపు వేకువ అడుగులు వేస్తున్న రాష్ట్రాన్ని 2014లో విభజిం చారన్నారు. ఈ పరిస్థితిలో విద్య, వైద్య, ఉద్యోగ, పారిశ్రామిక, ఆర్థిక తదితర వనరులన్నిటిని ఏపీ వదులుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి కేటాయించిన సెంట్రల్ యూనివర్సిటీని అనంతపురంలో ఏర్పాటుచేసినా నేటికీ పూర్తిస్థాయి నిధులివ్వడం లేదని మండిపడ్డారు. మరోవైపు దేశంలో ఎక్కడాలేని విధంగా ట్యూషన్, హాస్టల్, పరీక్షలు, ల్యాబ్ ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వమే ఫీజుల భారాన్ని భరించి ఉచిత విద్యను అందించాల్సిన అవసరముందని తెలిపారు. ఆ దిశగా ఎస్ఎఫ్ఐ పోరాటాలు సాగించి సెంట్రల్ యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించేందుకు నడుం బిగించాలని సూచించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ, అనంతపురం నూతన కమిటీ కార్యదర్శిగా వంశీకృష్ణ, అధ్యక్షురాలిగా అన్నా అనసున్‌తో పాటు 21మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షుడు గిరి, సహాయకార్యదర్శి భీమేష్, నాయకులు సోము, సాయి, జనీత్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ నిర్మాణంపై వివాదం

● చేతులు మారిన లక్షల రూపాయలు ● ఫోర్జరీ సంతకాలతో అనుమతులు ● జిల్లా అధికారుల విచారణ



గాండ్లపాడు వద్ద నిర్మిస్తున్న గోడౌన్

పుట్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నిర్మాణం కొందరు అధికారులకు ఆదాయ వనరుగా మారుతోంది. ఇలా గోడౌన్లు కట్టాలంటే నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములను కమర్షియల్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేయాల్సి ఉంది. కానీ అధికారులకు చేతులు తడపడంతో ఏకంగా కొందరు సంతకాలు సైతం ఫోర్జరీ చేసి అనుమతి పత్రాలు పుట్టించారు. ఈ తతంగం మండలంలోని గాండ్లపాడు-ఎస్. తిమ్మాపురం గ్రామాల మధ్య ఉన్న గోడౌన్ నిర్మాణ విషయంలో చోటుచేసుకుంది. శనగలగూడూరు గ్రామ రెవెన్యూపరిధిలోని 47,48, 49 సర్వేనెంబర్లలోగల వ్యవసాయ భూమిలో కొందరు గోడౌన్ నిర్మిస్తున్నారు. ఈ గోడౌన్‌లో పప్పుశనగ, కందులు తదితర ధాన్యాలను నిల్వ చేయనున్నారు. కాగా దీనిని అనుమతి పత్రాలు లేకుండా నిర్మిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సైతం విచారణ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు అధికారులకు పెద్దఎత్తున అమ్యామ్యాలు ముట్టజెప్పారన్న ఆరోపణలు ఉన్నాయి.

పంచాయతీ కార్యదర్శి పేరిట ఫోర్జరీ సంతకాలు

ఈ గోడౌన్ నిర్మాణానికి సంబంధించి ముందుగా పంచాయతీ కార్యదర్శి అనుమతులకు ప్రతిపాదన పెట్టాల్సి ఉంటుంది. వీటిని ఈఓఆర్డీ, ఎంపీడీఓలు పరిశీలించి జిల్లా డీఎల్‌పీఓకు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈ నిర్మాణంపై సర్వేచేసి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓకు సంబంధిత ఫైల్ పంపించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం అన్ని చక్క బెట్టుకొని కొందరు వ్యక్తులు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ పేరిట అనుమతి పత్రాలను నిర్వాహకులకు అందజేసినట్లు తెలిసింది. కానీ ఆ అనుమతులు తాను ఇవ్వలేదంటూ పంచాయతీ కార్యదర్శి ఎంపీడీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశాడు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ అక్కడ గోడౌన్ నిర్మాణానికి ఎవరు అనుమతులు ఇవ్వలేదంటూ తెలిపారు.

చేతులు మారిన లక్షలాది రూపాయలు

గాండ్లపాడు గ్రామశివారులో నిర్మిస్తున్న నూతన గోడౌన్ సుమారు రూ.3కోట్ల వ్యయంతో నిర్మాణం చేస్తున్నట్లు తెలిసింది. వీటికి సంబంధించి అధికారులకు అనుమతుల పేరిట లక్షల రూపాయలు చేతులు మారినట్లు విశ్వసనీయ సమాచారం. వీటిలో కొంతమొత్తం ఓ అధికారి ఫోన్‌పే ద్వారా లావాదేవీలు జరిపాడన్న ఆరోపణలు ఉన్నాయి. కోట్ల రూపాయలు పెట్టి గోడౌన్‌ను నిర్మిస్తున్నారు మాకేమి చూసుకోరా అంటూ ఆ అధికారులు నిర్మాణం చేసే వ్యక్తుల వద్ద డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలు రావడంతో సంబంధిత అధికారి సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారుల విచారణ

గోడౌన్ అనుమతుల ఫోర్జరీ సంతకాలపై ఉన్నతాధికారులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రత్యేక అధికారి ఆంజనేయులు వేర్వేరుగా విచారణ ప్రారంభించారు. గోడౌన్‌కు అనుమతులు ఎప్పుడు ఇచ్చారు, పంచాయతీ కార్యదర్శి సంతకాలు నిజంగానే ఫోర్జరీ చేశారా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ సైతం స్పందించి వీటిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం.

అనుమతులు ఇవ్వలేదు..



గాండ్లపాడు వద్ద చేపడుతున్న గోడౌన్ నిర్మాణానికి తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. పంచాయతీ అధికారులు మూడు సెంట్లలో నిర్మాణాలకు మించి అనుమతులు ఇవ్వకూడదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

- అలివేలమ్మ, ఎంపీడీఓ

సంక్షిప్త వార్తలు

పండ్ల ఎగుమతికి ప్రోత్సాహం ఇవ్వండి

● యూరప్ కంపెనీ ప్రతినిధిని కోరిన మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్



యూరప్ కంపెనీ ప్రతినిధిని సన్మానిస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కరువుప్రాంతమైన అనంతపురం జిల్లాలో అరటి, దానిమ్మ, చీనీ తదితర పంటలు పండుతున్నాయని, వీటి దిగుబడి యూరప్ దేశాలకు ఎగుమతి అయ్యేలా ప్రోత్సాహం కల్పించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి యూరప్ దేశానికి చెందిన ఫైట్రాస్ కంపెనీ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాట్రిక్‌ను కోరారు. మండలంలోని చుక్కలూరు వద్ద గల సిద్దార్థ కోల్డ్‌స్టోరేజీని పాట్రిక్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జేసీపీఆర్ మాట్లాడుతూ ఈ జిల్లాలో నాణ్యమైన పండ్లతోటలు కలిగి ఉన్నాయన్నారు. ఇప్పటికే ఇరాక్, ఇరాన్, దుబాయ్ లాంటి దేశాలకు పండ్ల ఉత్పత్తులను పంపిస్తున్నామన్నారు. యూరప్‌కు ఎగుమతి చేసేందుకు సహకరించాలని కోరారు. అంతకుమునుపు పాట్రిక్‌ను జేసీపీఆర్ శాలువా కప్పి షీల్డ్ ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ జేడీ దేవమునిరెడ్డి, ఉద్యానవనశాఖ అధికారులు రత్నకుమార్, ఉమాదేవి, శైలజ, నరసింహారెడ్డి, రామోజీ, ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాదయాత్ర పోస్టర్ల విడుదల

కూడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ఇన్సూరెన్స్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఉరకొండ నుంచి అనంతపురంలోని కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముద్దలాపురం గ్రామంలో ఆదివారం ఆయన ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాదయాత్ర అయిన వెంటనే కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతామని తెలిపారు. రైతులందరూ పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో రైతులు పండించిన మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్నల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కృష్ణమూర్తి, వీరప్ప, నారాయణరెడ్డి, చిదంబరమ్మ, రాధాకృష్ణ, ఖరీం, వెంకటేశులు, సర్పంచ్ ధనుంజయ పాల్గొన్నారు

కళ్యాణదుర్గంరూరల్/బెళుగుప్ప: పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు పాదయాత్రకు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, నాయకులు రఘు, విక్రమ్, శీన, ఒంటిమిద్ది, గోవిందప్ప పాల్గొన్నారు. అలాగేబెళుగుప్ప మండలకేంద్రంలో రైతు సంఘం, సీఐటీయూ నాయకులు పాదయాత్ర పోస్టర్లును విడుదల చేశారు. నాయకులు భీమన్న, వెంకటేశులు, మారెప్ప, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీపై రైతులకు అవగాహన



నూతన టెక్నాలజీ గురించి రైతులకు వివరిస్తున్న క్రాప్‌నౌ సభ్యులు

కణేకల్లు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నూతన టెక్నాలజీతో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని క్రాప్ నౌ సీఈఓ మహ్మద్‌కబీర్ పేర్కొన్నారు. మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో ఆదివారం ఆయన క్రాప్ నౌ సభ్యులతో కలిసి వ్యవసాయ రంగంలో రైతులు నూతన టెక్నాలజీతో ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చో వివరించారు. అనాదిగా సాంప్రదాయ పద్ధతులలో కాకుండా సీడ్ అనే టెక్నాలజీతో రూపొందించిన నూతన పరికరాల ద్వారా వ్యవసాయాన్ని మరింత మెరుగు పరిచేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి, కూలీల కొరత నివారణ వంటి అంశాలతో పాటు వ్యవసాయంలో రైతులకు నూతన పరిజ్ఞానాన్ని అందించి నూతన టెక్నాలజీతో వారిని అభివృద్ధి పరచేందుకు తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఎంసీ సర్మాస్, వలి, దోణప్ప, ఓబుళరాజ్ తదితరులకు వారు నూతన టెక్నాలజీ గురించి వివరించారు.

ఉరవకొండకే తలమానికం.. గవిమఠం

● 4 నుంచి చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గవిమఠం ముఖద్వారం



చంద్రమౌళీశ్వరస్వామి

ఉరవకొండ, మార్చి2(ఆంధ్రజ్యోతి): వందల ఏళ్ల చరిత్ర కలిగిన గవిమఠం ఉరవకొండకే తలమానికంగా నిలుస్తోంది. విశిష్టతకు మారుపేరుగా విరాజిల్లుతోంది. ఇక్కడ వెలసిన గవిమఠ స్థితచంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

గవిమఠం చరిత్ర

శైవమత ప్రచారం కోసం దాదాపు రెండు దశాబ్దాల కిందట ఇక్కడ కరిబసవరాజేంద్రస్వామి మఠాన్ని స్థాపించారు. ఈ మఠంలో ఒక గుహ ఉంది. ఈ ప్రాంతంలోనే పీఠాధిపతులు ధ్యానం, తపస్సులు, యజ్ఞాలు నిర్వహించేవారు. గుహ ఉన్నచోటునే గవిగా ప్రాచుర్యమైంది. దీంతో గవిమఠంగా పేరు స్థిరపడింది. 1823మధ్య కాలంలో మైసూరు మహారాజుకు అన్నం చూస్తే పురుగులు మాదిరిగా కనిపిస్తుండడంతో తీవ్రంగా బాధపడుతుండేవారు. ఈ క్రమంలో ఆ బాధను కరిబసవరాజేంద్రస్వామి దూరం చేయడంతో మైసూరు మహారాజు స్వయంగా స్వామి కాలికి గండపేరండం తొడిగి సత్కరించారు. అలాగే మొలకాల్మూరు సమీపంలో బుడ్డనహల్లి గ్రామాన్ని జాగీర్‌గా ఇచ్చి 30 మనువుల వెండితో పాటు గజరాజును, దాని పోషణార్థం 30ఎకరాల మాన్యాన్ని ఇచ్చారు. ఎన్నో మహిమాన్విత కార్యక్రమాలతో మఠాధిపతులు మఠానికి అత్యంతప్రాధాన్యత తెచ్చారు. దాదాపుగా 770మఠాలను తమ అనుబంధంగా వివిధ రాష్ట్రాలలో ఏర్పాటు చేశారు. మఠం అనతి కాలంలోనే అభివృద్ధి చెందడంతో ఇక్కడ వెలసిన గవిమఠ స్థితచంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 1814నుంచి ఏటా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

4 నుంచి బ్రహ్మోత్సవాలు

చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 4వ తేదీన కంకణధారణతో ప్రారంభం కానున్నాయి. 5న నాగాభరణం, 6న నెమలి వాహనోత్సవం, 7న అడ్డపల్లకీ ఉత్సవం, ఐరావతవాహనోత్సవం, 8న బసవేశ్వరవాహనోత్సవం, 9నమహారథోత్సవం, 10న లంకాదహనం, 11న అశ్వవాహనం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని అసిస్టెంట్ కమిషనర్ రాణి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

● తుప్పు పడుతున్న 104, 108 వాహనాలు
● మరమ్మతుకు గురై పీహెచ్‌సీలో ఓ మూలనపడి ఉన్న వైనం
● రిపేరీ గురించి పట్టించుకోని అధికారులు



పీహెచ్‌సీలో మూలనపడ్డ 108, 104 వాహనాలు

కూడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించే 104, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడే 108 వాహనాలు మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. నెలలు గడుస్తున్నా.. వాటిని బాగు చేయించడం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. వివిధ ప్రాంతాలకు చెందిన వాహనాలను మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ మూలన పార్క్ చేశారు. అవి ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పడుతున్నాయి. ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలందించడం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఆ వాహనాలకు ఎందుకు రిపేరీ చేయించడం లేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించాల్సి ఉంది.

ఘనంగా భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న కూటమి నాయకులు

డీ.హీరేహాళ్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ఆదివారం కురుబలు తమ ఆరాధ్య దైవమైన భక్త కనకదాస విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మూడురోజుల పాటు వేద పండితుల చేత పలు పూజలు జరిపించారు. ఆదివారం విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్ హాజరై కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. టీడీపీ రాయదుర్గం మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు పంపాపతి, బసవ, మహేష్, భీమలింగ, శంకర్, పరమేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

రేపు బెస్తరపల్లిలో జాతర

●పాల్గొననున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలం బెస్తరపల్లిలో మంగళవారం బొమ్మలింగేశ్వరస్వామి జాతర ఘనంగా జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు ఉదయమే ఎమ్మెల్యేఅమిలినేని సురేంద్రబాబు రానున్నారు. ఇక్కడ స్వామికి పూజలు చేసి తర్వాత వెను వెంటనే విజయవాడకు వెళ్లి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కానున్నారు.

మామిడికి తెగులు

● రాలిపోతున్న పూత, పిందెలు
● ఆందోళనలో అన్నదాతలు



బూడిద తెగులు సోకిన మామిడిపూత

శెట్టూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో బోరుబావులున్న చాలామంది రైతులు మామిడి పంటను సాగు చేశారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా.. తేనెమంచు, బూడిద తెగులు సోకడంతో పాటు పిందెలు పసుపు రంగులోకి మారి నేలపాలవుతున్నాయి. పూత కూడా రాలిపోతోంది. దీంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడి పంటలను సంరక్షించుకునేందుకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి రసాయన మందులు పిచికారీ చేస్తున్నామని, ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. పూత, పిందెలు రాలిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉంటున్నామన్నారు. ఉద్యానవన శాఖ అధికారులు పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు అందించాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వం సబ్సిడీతో మందులు అందజేయాలని కోరుతున్నారు.

రైల్వే పాయింట్స్‌మన్‌పై దాడి

గుంతకల్లు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు జీఆర్పీ పరిధిలోని రాయదుర్గం రైల్వే స్టేషన్ సమీపంలో గల లెవెల్ క్రాసింగ్ వద్ద పాయింట్స్‌మన్ పాపావత్ నాయక్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. లెవెల్ క్రాసింగ్ గేటు వేయడంతో పాయింట్స్‌మన్‌కు, గొంతనపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతరెడ్డి రాయితో పాపావత్ నాయక్ తలపై కొట్టాడు. రక్తగాయమైన అతడిని స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుంతకల్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర ఆదివారం రాత్రి కేసును నమోదు చేశారు.

మోడల్ టాలెంట్ టెస్ట్

గుంతకల్లుటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సాయిమహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ మెయిన్స్‌కు మోడల్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇందులో ప్రతిభచూపిన అభ్యర్థులకు బహుమతులుఅందజేస్తామన్నారు. పరీక్షకు 48 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, డీవైఎఫ్‌ఐ నాయకులు సురేంద్ర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని విద్యుత్ కార్యాలయ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన ఫక్కీరప్ప, నరసింహులు బైక్‌పై గుత్తికి వస్తూ.. విద్యుత్ కార్యాలయం సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. దీంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో తోటలో గల పేకాటకేంద్రంపై ఆదివారం దాడులు చేశామని, అందులో పేకాట ఆడుతున్న 10మందిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.60వేలు నగదు, 10ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. రూరల్ ఎస్‌ఐ ధరణీబాబు, పట్టణ ఎస్‌ఐ గౌస్‌బాషా , సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అరెస్టయిన వారిపై కేసు నమోదుచేశామని చెప్పారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

ఉరవకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ దళిత హాస్టల్ అక్రమ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ హాస్టల్‌ను ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గాంధీ దళిత హాస్టల్‌కు సంబంధించి సర్వే నెంబర్ 533-బీ1లో 1.04 సెంట్ల భూమిని కొందరు వేరే సర్వే నెంబర్ ఆధారంగా చెక్‌బందీలు మార్చుకుని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. వెంటనే ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి 1941 నుంచి రికార్డులలో ఎలాగా ఉందో అలాగే పేర్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు జగదీష్, రమేష్‌బాబు, రాజేష్, చంద్రశేఖర్, బీరప్ప, చంద్రబాబు పాల్గొన్నారు.

బిల్లులు అందక.. నిర్మాణాలు సాగక..

● మధ్యలోనే ఆగిపోయిన ఆస్పత్రుల భవన నిర్మాణాలు

యాడికి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు రాయలచెరువు గ్రామంలో సుమారు రూ.3.80 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆస్పత్రి భవనాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. శంకుస్థాపన సమయంలో నాటి వైసీపీ ప్రజా ప్రతినిధులు ఆస్పత్రి భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అన్ని సౌకర్యాలతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని హామీలు గుప్పించారు. అయితే ఆ ప్రభుత్వంలో సరిగా బిల్లులు పడకపోవడం వల్ల భవనాల నిర్మాణ పనులు ఎప్పటికప్పుడు నిలిచిపోతూ వచ్చాయి. ఇక నేటికి కూడా పూర్తికాలేదు. చేసేదిలేక యాడికిలో శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే రోగులు చికిత్స పొందాల్సి వస్తోంది. వైద్య సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాయలచెరువులో రేకులషెడ్డులో రోగులకు చికిత్స అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వలోనైనా ఆస్పత్రుల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



యాడికిలో ఆగిపోయిన ఆస్పత్రి భవన నిర్మాణం



రాయలచెరువులో..

బుగ్గ రామలింగేశ్వరుడికి ఏకాంత సేవ



ఏకాంతసేవలో బుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఏకాంత సేవతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేసి పల్లకిపై కొలువుదీర్చి ఏకాంతసేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడమ్మ జ్యోతులు



ప్రత్యేక అలంకరణలో చౌడమ్మతల్లి

తాడిపత్రి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యల్లనూరురోడ్డులో ఆదివారం చౌడమ్మ జ్యోతులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొగటవీర క్షత్రియులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం వద్ద నుంచి గంగా తీర్థం తీసుకువచ్చి అభిషేకం చేసి పూజలు జరిపారు. తెల్లవారుజామున నుంచి పట్టణ పురవీధుల్లో జ్యోతులు ప్రదర్శన చేపట్టారు. తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

గుంతకల్లుటౌన్, మార్చి2(ఆంధ్రజ్యోతి):మండలంలోని కసాపురం గ్రామంలో నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే అర్చకులు స్వామి వారి మూలవిరాటుకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కొలువు దీర్చి నవకలశ తిరుమంజన స్నపనం చేశారు. సాయంత్రం మూలమంత్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ

గుత్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులో మదరసా దారుల్‌ఉలుమ్ ఫైజుల్ ఇస్లాం సంస్థ వారు ఆదివారం పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాసాలు ఉంటున్న పేద ముస్లింలకు ఒక్కొక్కరికి రూ.2500లు విలువ చేసే సరుకుల కిట్‌ను టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి చేతులమీదుగా అందజేశారు. సుమారు 150మందికి అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు షేక్ మౌలానా అబ్దుల్‌హక్ తెలిపారు. సభ్యుల పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

యాడికి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కరెస్పాండెంట్ లారెన్స్‌బాబు వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నతస్థాయిలో రాణించగలరని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామూహిక లలితాసహస్రనామ పారాయణం



లలితా సహస్ర నామ పారాయణాన్ని పఠిస్తున్న మహిళలు

రాయదుర్గం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిందనూరు కల్యాణమంటపంలో ఆదివారం 200 మంది మహిళలు సామూహికంగా లలిత సహస్ర నామ పారాయణం చేసి నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. కళారాధన భరతనాట్య అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధులు రికార్డు చేశారు. ఆధ్యాత్మిక గురువు అర్యన్ రామ్మూర్తి స్వామీజీ పర్యవేక్షణ చేయగా ఆల్ ఇండియా రేడియో అనౌన్సర్ లంకా ప్రసాద్ హాజరయ్యారు. తొలిసారిగా లలిత సహస్రనామ పారాయణం సామూహికంగా నిర్వహించి రికార్డు సాధించడం ఆనందంగా ఉందని అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు శ్వేతపద్మిని, విదూషి జ్యోతినాగేష్ తెలిపారు.

పందుల దాడిలో జొన్న పంట ధ్వంసం



ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు

యాడికి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రైతు పురుషోత్తంకు చెందిన మొక్కజొన్న పొలంలోకి పందులు చొరబడి పంటనంతా నాశనం చేశాయి. 7.5ఎకరాల్లో జొన్నపంట సాగుచేశానని, ఆదివారం ఉదయం గ్రామంలోని పందులు పొలంలోకి వచ్చి పంటనంతా నాశనం చేశాయని బాధిత రైతు వాపోయాడు. సుమారు లక్ష రూపాయల పంటను నష్టపోయినట్లు తెలిపాడు. గ్రామ పంచాయతీ అధికారులు తగు చర్యలు చేపట్టి పందులను గ్రామానికి దూరంగా తరలించాలని కోరాడు.

నిరుపయోగంగా జనరేటర్



నిరుపయోగంగా ఉన్న జనరేటర్

గుంతకల్లు టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జనరేటర్ నిరుపయోగంగా ఉంది. 2014లో ఎన్నికల సమయంలో అధికారులు ఈ జనరేటర్ కొనుగోలు చేశారు. కొద్దిరోజుల తర్వాత అది మరమ్మతులకు గురవడంతో పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. ఇక అప్పటి నుంచి కార్యాలయ ఆవరణలో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. జనరేటర్ చుట్టూ ఏపీ స్వా కేబుల్ తీగలు వెళ్లాయి. జనరేటర్, కేబుల్ వైర్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జనరేటర్‌ను ఇలా మూలకు వేయడం ఏమిటని, ఇప్పటికైనా మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.